





# ఖమ్మంలో చరిత్ర సృష్టిస్తాం

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

గత చరిత్రలో ఏనాడూ కనీ వినీ ఎరుగని రీతిలో భారతీయ జనతా పార్టీ ప్రభంజనం ఏమిటో ప్రస్తుత ఖమ్మం పార్లమెంటు ఎన్నికల్లో నిరూపిస్తామని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఖమ్మం గడ్డపై తిరుగులేని శక్తిగా ఎదుగుతోందన్నారు. రేపు తన నామినేషన్ దాఖలు చేసే సందర్భంగా తనను ఆశీర్వదించడానికి వేలాది మంది బీజేపీ కార్యకర్తలు, శ్రీరాముని ఆశీస్సులతో తనతో కలిసి వస్తారని అన్నారు. ఖమ్మం గడ్డపై కాంగ్రెస్, కమ్యూనిస్టులు, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటి వరకూ ఎంపీ అభ్యర్థులుగా ప్రాతినిధ్యం వహించారనీ, ఇక ఒకసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలన్న ఆశయంతో ఓటర్లు ఉన్నారని అన్నారు. తాను ఎక్కడికి వెళ్లినా ప్రచారంలో ప్రజలనుండి వస్తున్న స్పందన రోజురోజుకూ మరింతగా పెరుగుతోందన్నారు. రేపు తన నామినేషన్‌కు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతారని అన్నారు. బీజేపీ శ్రేణులు అందరూ ఒకే తాటిపైకి వచ్చి తన గెలుపు కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారని అన్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధి జరగాలంటే ఖమ్మం పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలవాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర అన్నారు.



## రికార్డు సృష్టిస్తాం...తాండ్ర

ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ సత్తా ఏంటో చూపిస్తామనీ, ప్రజల మద్దతు, శ్రీరాముని దీవెనలతో బీజేపీ విజయం సాధించి రికార్డు సృష్టించబోతుందని ఎంపీ అభ్యర్థి తాండ్ర జోస్యం చెప్పారు. ఎంపీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల నుండి బీజేపీకి ప్రజల మద్దతు పెరుగుతోందన్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మికులు, దినసరి కూలీలు, మహిళలు, యువత, సంఘటితరంగా, అసంఘటిత రంగ కార్మికులు అందరూ బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని సత్తుపల్లి, వైరా, పాలేరు, మధిర, ఖమ్మం, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో తాను, తనతో పాటు బీజేపీ శ్రేణులు నిత్యం ప్రజలతో సమావేశాలు నిర్వహించే సమయంలో వస్తున్న ప్రజా స్పందనకు తిరుగులేదన్నారు.

## ఖమ్మం సమగ్రాభివృద్ధికి ప్రణాళిక

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయంగా, సామాజికంగా ఎంతో చైతన్యవంతమైందని తాండ్ర వినోద్ రావు స్పష్టం చేశారు. ప్రధానంగా గోదావరి, కృష్ణా జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఈ ప్రాంతం వ్యవసాయం, పరిశ్రమల స్థాపనలో వెనకడుగు వేసిందన్నారు. బీజేపీ గెలిచిన తరువాత తాను కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి వ్యవసాయ, పారిశ్రామిక కారిడార్లుగా రూపొందించేందుకు కృషిచేస్తానన్నారు. దీంతో పాటు ఆధ్యాత్మిక పరంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చారిత్రక నేపథ్యం ఉందన్నారు. ముఖ్యంగా సాక్షాత్తూ శ్రీరామ చంద్రుడు సీతా సమేతంగా నడయాడిన నేల ఇది అన్నారు. ఖమ్మం జిల్లా పావనమైందన్నారు. ఈ నేలను ఆధ్యాత్మిక కారిడార్‌గానూ రూపొందిం చాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రక ప్రదేశాలను కలుపుతూ ఆధ్యాత్మిక కేంద్రాలుగా విరాజిల్లేలా పలు ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భద్రాచలం పుణ్యక్షేత్రానికి అనుబంధంగా పంచవటి పర్ణశాల, తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని అన్నారు.

## యువతకు భవిష్యత్తు ఇవ్వాలి...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యువత పెద్దఎత్తున నిరుద్యోగంతో ఇబ్బందుల్లో ఉన్నారని వారికి పారిశ్రామిక, వ్యవసాయ కారిడార్లుగా ఖమ్మంను అభివృద్ధి చేసి వారికి ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి భవిష్యత్తు యువతేనని వారికి కాపాడుకోక పోతే దేశానికి అనర్థం జరుగుతుందన్నారు. దేశంలో మోడీ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమనీ, రాబోవు రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా యువతకు మంచి జరుగుతుందని తాండ్ర వినోద్‌రావు అన్నారు. ప్రపంచంలో తిరుగులేని శక్తిగా భారత్ ముందడుగు వేస్తోందనీ, అన్ని రంగాల్లో భారత్ పురోగమిస్తోం దన్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు మేలు జరగాలన్నారు. తనకు మద్దతిచ్చి తన గెలుపుకోసం కృషిచేస్తున్న ప్రతీ ఒక్కరికీ తాండ్ర వినోద్ రావు కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగేలా తనవంతుగా కృసిచేస్తానని అన్నారు. అందుకే బీజేపీ అభ్యర్థిగా తనను గెలిపించి పార్లమెంటుకు పంపాలని తాండ్ర వినోద్ రావు ప్రజలకు విన్నవించారు. మీ మద్దతు ఇప్పుడు తనకు అవసరం ఉందనీ, తరువాత జిల్లా అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని అభయం ఇచ్చారు.